హైవేలపై నడక మార్గాలను పెంచాలి

- సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయాలి
- రహదారి భద్రతపై సమీక్షలో మంత్రి పొన్నం

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): జాతీయ రహదారులపై రద్దీగా ఉండే ప్రాంతాల్లో పాదచారుల నడక మార్గాల సంఖ్యను పెంచడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. పాదచారుల భద్రతను మెరుగుపరచడంతోపాటు రద్దీగా ఉండే హైవే స్ట్రెచ్‌లలో ప్రమాదాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. రహదారి భద్రతకు సంబంధించి సుప్రీంకోర్టు ఆదేశాల అమలుపై శుక్రవారం హైదరాబాద్‌లోని రవాణాశాఖ కార్యాలయంలో అత్యున్నత సమీక్షా సమావేశం జరిగింది. రవాణా శాఖ కమిషనర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాద మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వంలోని అన్ని విభాగాలు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించడం, అత్యవసర సేవలను మెరుగుపర్చడం, రోడ్డు భద్రతా చట్టాలను, ట్రాఫిక్ నిబంధనలను అమలు చేయడంపై చర్చించారు. రహదారి భద్రత చర్యల్లో భాగంగా జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీలు నెలవారీగా సమావేశం కావాలని నిర్ణయించారు. రవాణా, ట్రాఫిక్, వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ, రోడ్లు-భవనాలు, ఎన్‌హెచ్ ఏఐ, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ అధికారులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్లకు రూ.174.96కోట్లు మంజూరు

హైదరాబాద్, ఆగస్టు23 (నమస్తే తెలంగాణ): బీసీ సంక్షేమశాఖ పరిధిలోని పలు ఫెడరేషన్లు, కార్పొరేషన్లకు కలిపి మొత్తంగా రూ.174.96 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బీసీ కార్పొరేషన్ రూ.4కోట్లు, ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.1.13కోట్లు, తాడిటాపర్ కార్పొరేషన్‌కు రూ.1.22కోట్లు, వాషర్‌మెన్ ఫెడరేషన్‌కు రూ.16.51లక్షలు, నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్‌కు రూ.18.66లక్షలు, బీసీ స్టడీ సర్కిల్‌కు రూ.29.83లక్షలు, బీసీ గురుకుల సొసైటీకి రూ.167.94కోట్లను మంజూరు చేశారు.

ఏసీబీకి పట్టుబడిన వసంత

ఏసీబీ వలలో సీటీవో

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నారాయణగూడ సర్కిల్‌కు చెందిన డిప్యూటీ వాణిజ్య పన్నుల అధికారి (సీటీవో) బీ వసంతను లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధకారులు పట్టుకున్నారు. ఓ వ్యక్తి ఖాతాలో ఆర్థిక అవకతవకలను ఉపేక్షించేందుకు ఆమె రూ.35వేలు లంచంగా డిమాండ్ చేశారు. ఆ మొత్తాన్ని ఆమె సదరు వ్యక్తి నుంచి స్వీకరిస్తుండగా పట్టుకున్నట్టు తెలంగాణ ఏసీబీ అధికారులు శుక్రవారం వెల్లడించారు.

ఈ నెల 19న వనపర్తి జిల్లాలో బస్సులోనే పండంటి బిడ్డకు జన్మనిచ్చిన గర్భిణి సంధ్య

ఆటోలోనే గర్భిణి ప్రసవం

ఆటోలోనే జన్మించిన బాబు

మల్యాల: జగిత్యాల జిల్లా మల్యాల మండలం తాటిపల్లికి చెందిన కాంపెల్లి లత అనే గర్భిణి ఆటోలోనే ప్రసవించింది. శనివారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో ఆశవర్కర్ సాయంతో 108కి ఫోన్‌చేయగా అందుబాటులో లేదని చెప్పారు. దీంతో ఆ మహిళను మల్యాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి ఆటోలో తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆటోలో ప్రసవించిన లతను స్థానిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చి పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం జగిత్యాల దవాఖానకు తరలించారు. తల్లీబిడ్డలిద్దరూ క్షేమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానలో అశ్విని బెడ్ వద్ద ఘటనకు సంబంధించి విచారణ చేపడుతున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

సర్కారు దవాఖానలో కుర్చీలోనే కాన్పు

- అర్ధరాత్రి వేళ నల్లగొండ జనరల్ దవాఖానలో ఘటన
- పురిటి నొప్పులతో దేవరకొండ దవాఖానకు వెళ్తే డ్యూటీకి రాని డాక్టర్
- అర్ధరాత్రి అంబులెన్స్‌లో జిల్లా దవాఖానకు తరలింపు
- దేవరకొండ డాక్టర్, స్టాఫ్ నర్సుల సస్పెన్షన్
- నల్లగొండ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

నీలగిరి, ఆగస్టు 23: పురిటినొప్పులతో కాన్పు కోసం ప్రభుత్వ దవాఖానకు వెళ్లిన నిండు గర్భిణి అర్ధరాత్రి నానా అవస్థలు పడింది. మొదట సమీపంలోని ప్రభుత్వ దవాఖానకు వెళ్తే డాక్టర్లు లేరు. అక్కడి నుంచి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా కేంద్ర దవాఖానకు అంబులెన్స్‌లో వస్తే, చివరకు కుర్చీలోనే ప్రసవించాల్సిన దుస్థితి ఎదురైంది. అదృష్టవశాత్తు తల్లీ, బిడ్డ ఇద్దరూ క్షేమంగానే ఉన్నారు. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలానికి చెందిన నల్లవెల్లి అశ్విని నిండు గర్భిణి. గురువారం రాత్రి 10 గంటలకు పురుటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు దేవరకొండ ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ డ్యూటీ డాక్టర్, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో నర్సులు నల్లగొండ జిల్లా దవాఖానకు వెళ్లాలని సూచించారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో బయల్దేరి అర్ధరాత్రి 12:30 గంటలకు నల్లగొండలోని మాతా శిశు సంరక్షణ కేంద్రానికి చేరుకున్నారు. ఆ సమయంలో డ్యూటీలో ఉన్న డాక్టర్ నిఖిత, నర్సులు పరీక్షించి ప్రసవానికి ఇంకా సమయం ఉన్నదని చెప్పారు. 30 నిమిషాల తరువాత రెండోసారి బీపీ చెక్ చేసి బాగానే ఉన్నదన్నారు. అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో అశ్వినిని వాకింగ్ చేయాలని సూచించడంతో వాకింగ్ చేస్తుండగా పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దాంతో ఆమె పక్కనే ఉన్న కుర్చీలో కూర్చున్నది. నిమిషాల వ్యవధిలో కుర్చీలోనే శిశువుకు జన్మనిచ్చింది. అశ్విని తల్లి బిడ్డను గట్టిగా పట్టుకుని వెంటనే డాక్టర్‌ను పిలిచింది. అదృష్టవశాత్తు బిడ్డకు ఎలాంటి ప్రమాదమూ జరగలేదు. లేబర్‌రూమ్ నుంచి వచ్చిన సిబ్బంది అశ్వినిని వార్డులోకి తీసుకెళ్లారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. ఘటనపై కలెక్టర్ సీ నారాయణరెడ్డి ఆదేశం మేరకు అదనపు కలెక్టర్ టీ పూర్ణచంద్ర శుక్రవారం జిల్లా దవాఖానను సందర్శించారు. అశ్విని, ఆమె కుటుంబసభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దవాఖాన పర్యవేక్షకులు, ఆర్ఎంవో, డ్యూటీ డాక్టర్లతో మాట్లాడారు. అనంతరం దేవరకొండ ప్రభుత్వ దవాఖానలో విధుల్లో లేని డ్యూటీ డాక్టర్ శాంతిస్వరూప, విధుల్లో ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహరించిన స్టాఫ్ నర్సులు విజయలక్ష్మి, సైదమ్మ, మౌనిక, సరితను సస్పెండ్ చేయాలని డీసీహెచ్ఎస్‌ను ఆదేశించారు. నల్లగొండ దవాఖానలోని డ్యూటీ డాక్టర్, సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

అశ్విని మూడో కాన్పు కోసం దేవరకొండ దవాఖానకు వెళ్లగా అక్కడ వైద్యులు లేకపోవడంతో నల్లగొండ జిల్లా దవాఖానకు పంపారు. ఇక్కడ రెండుసార్లు పరీక్షించిన వైద్యులు డెలివరీకి ఇంకా సమయం ఉన్నట్టు గుర్తించారు. ఆగి ఆగి నొప్పులు వస్తుండటంతో లేబర్ రూమ్‌లోకి వెళ్లి బట్టలు మార్చుకోవాలని సూచించారు. ప్రసవానికి ఇంకా సమయం ఉండటంతో వైద్య నిబంధనల ప్రకారం వాకింగ్ చేయాలని చెప్పారు. రాత్రి 2 గంటల సమయంలో అశ్విని నడుస్తుండగా, లేబర్ రూమ్ ముందు నొప్పులు ఎక్కువై అక్కడే ఉన్న కుర్చీలో బిడ్డను ప్రసవించింది. డాక్టర్లు, సిబ్బంది వెంటనే వచ్చి వైద్యసేవలు అందించారు. ఈ ఘటనలో గురువారం రాత్రి డ్యూటీలో ఉండాల్సిన దేవరకొండ దవాఖాన డ్యూటీ డాక్టర్‌తోపాటు విధుల్లో ఉన్న నర్సులను సస్పెండ్ చేయాలని డీసీహెచ్ఎస్‌ను ఆదేశించాం. నల్లగొండ దవాఖానకు సంబంధించి అనుభవం ఉన్న వారి సహాయం లేకుండా వాకింగ్ చేయాలని సలహా ఇవ్వడం వల్ల కుర్చీలోనే ప్రసవం జరిగిందని గుర్తించాం. అందుకు బాధ్యులైన డ్యూటీ డాక్టర్ నిఖితతోపాటు నలుగురు స్టాఫ్ నర్సులకు షోకాజ్ నోటీసులు ఇచ్చాం. వారి వివరణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటాం.

–టీ పూర్ణచంద్ర, అదనపు కలెక్టర్, నల్లగొండ

సర్కారు దవాఖానను నమ్ముకుంటే నిర్లక్ష్యం చేశారు

నా భార్యకు మొదటి రెండు కాన్పులు దేవరకొండ ప్రభుత్వ దవాఖానలోనే అయ్యాయి. గురువారం రాత్రి మూడో కాన్పు కోసం వెళ్తే అక్కడ నిర్లక్ష్యం చేశారు. నిద్రమత్తులో ఉండి కనీసం చెక్ చేయకుండా నల్లగొండ దవాఖానకు పంపించారు. ఇక్కడికి వస్తే డెలివరీకి టైమ్ ఉన్నదని వాకింగ్ చేయాలని చెప్పారు. వాకింగ్ చేస్తుండగా నొప్పులు రావడంతో నా భార్య కుర్చీలోనే ప్రసవించింది.

–ఆంజనేయులు, అశ్విని భర్త

పడకేసిన ప్రజారోగ్యం

- విషజ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడాల్సిందేనా?
- ముందస్తు కార్యాచరణ లేక ప్రజలకు తీవ్ర అవస్థలు
- ప్రాణాలంటే లెక్కలేదా.. ఇప్పటికైనా చర్యలు తీసుకోండి
- సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖ

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): ప్రజాపాలన అని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ సర్కారు ప్రజారోగ్యాన్ని పాతరేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. సీఎం సహా రాష్ట్ర యంత్రాంగమంతా ప్రజారోగ్య వ్యవస్థను గాలికొదిలేయడంతో జనం విషజ్వరాలతో మంచం పట్టే దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. గత 8 నెలలుగా పారిశుద్ధ్య నిర్వహణ దిగజారిపోవటంతో దోమల బెడదతో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యాతో ప్రజలు అవస్థలు పడుతున్నారని శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో ఉదహరించారు. రాష్ట్రవ్యాప్తంగా పల్లె, పట్టణం తేడాలేకుండా రోగుల సంఖ్య పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీజన్‌కు ముందే చర్యలు తీసుకోవాలనే కనీస అవగాహన సర్కారుకు లేకపోవటంతో ప్రజలు విషజ్వరాల బారిన పడే దుస్థితి నెలకొన్నదని దుయ్యబట్టారు.

జ్వరాలతో ప్రజలు.. ఢిల్లీ టూర్లలో సీఎం, మంత్రులు

ఈ ఏడాది దాదాపు 5,700 డెంగ్యూ కేసులు నమోదయ్యాయని అధికారిక లెక్కలు చెప్తున్నాయని, అనధికారికంగా ఈ సంఖ్య పదిరెట్లు ఎక్కువగా ఉంటుందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. డెంగ్యూకు సరైన సమయంలో చికిత్స అందకపోవటంతో ఇటీవల దాదాపు 50మంది చనిపోయారని, ఇందులో చిన్నపిల్లలూ ఉండటం బాధాకరమని అన్నారు. ఒక్క రోజే డెంగ్యూతో ఐదుగురు చనిపోయిన సంఘటన ప్రతి ఒక్కరిని కలిచివేసిందని చెప్పారు. ప్రభుత్వ దవాఖానల్లో సరైన వైద్య సౌకర్యాలు లేకపోవటం, సరిపడా మందులు లేని కారణంగా ప్రజలు ప్రైవేట్ హాస్పిటల్స్‌కు వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నదని అన్నారు. ప్రజారోగ్యాన్ని పట్టించుకోవాల్సిన సీఎం, మంత్రులు ఢిల్లీకి రాజకీయ యాత్రలు చేయటం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజారోగ్యంపై సీఎం స్థాయిలో సమీక్షలు జరగకపోవటం వల్లే వైద్యారోగ్యశాఖ విఫలమైందని ధ్వజమెత్తారు. ప్రజా ఆరోగ్యం అంటే పట్టింపు లేదా? అని సీఎంను ప్రశ్నించారు.

ముందస్తు కార్యాచరణతోనే సగం జబ్బుల నివారణ

విష జర్వాలు ప్రబలకుండా పారిశుద్ధ్య నిర్వహణకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, దోమల బెడద లేకుండా ఇప్పటికైనా పటిష్ట చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌ను కేటీఆర్ డిమాండ్ చేశారు. అభివృద్ధి కార్యక్రమాలు కాస్త ఆలస్యమైనా ఇబ్బందులు రావని, ప్రాణం పోతే తిరిగిరాదనే విషయాన్ని సీఎం గుర్తుంచుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో వర్షకాలానికి ముందే ప్రజారోగ్యంపై సమీక్షలు, ముందస్తు కార్యాచరణతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలు తీసుకున్న సందర్భాలను గుర్తుచేశారు. ఇకనైనా రాజకీయాలపై దృష్టిపెట్టడం మాని డెంగ్యూ, మలేరియా ఇతర విషజ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఓఆర్ఆర్ లీజును రద్దు చేయండి!

- మీ చేతిలో పనే కదా.. చర్యలు చేపట్టాలి
- ప్రతిపక్షంలో ఉన్నట్టే ఆరోపణలెందుకు?
- కాంగ్రెస్ మంత్రులకు కేటీఆర్ సవాల్

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): ఓఆర్ఆర్ లీజు విషయంలో కాంగ్రెస్ మంత్రులు ఇంకా ప్రతిపక్షంలో ఉన్నట్టుగానే ఆరోపణలు చేస్తుండటంపై జాలేస్తున్నదని కేటీఆర్ అన్నారు. ఓఆర్ఆర్ లీజును బీఆర్ఎస్ ప్రభుత్వం ఇష్టమొచ్చిన ధరకు ఓ సంస్థకు అప్పగించిందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించటంపై అభ్యంతరం వ్యక్తం చేసిన కేటీఆర్.. 'బీఆర్ఎస్ నిజంగానే తక్కువ ధరకు లీజుకు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తున్నది? మేం తక్కువ ధరకు లీజుకు ఇచ్చింది నిజమే అయితే సదరు లీజును రద్దు చేయాలి' అని డిమాండ్ చేశారు. టీవోటీ (టోల్ ఆపరేట్ (ట్రాన్స్‌ఫర్) లీజును రద్దు చేసి తాజాగా కొత్త బిడ్‌లు పిలవాలని సవాల్ విసిరారు. చేతిలో ఉన్న పని చేయకుండా బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేస్తే ప్రజలు సహించరని తేల్చిచెప్పారు. ఓఆర్ఆర్ లీజు విషయంలో తాము ఎన్‌హెచ్ఏఐ నిబంధనలనే అనుసరించామని స్పష్టంచేశారు. ఆ లీజు విషయంలో తప్పు జరిగి ఉంటే సర్కార్ చర్యలు తీసుకోవచ్చని.. బీఆర్ఎస్ మీద దుష్ప్రచారం చేసే ప్రయత్నం చేస్తే ఎంతోకాలం దాగదని వెల్లడించారు.

- తిరుమలలో గోల్డెన్ బాయ్స్ సందడి

మహారాష్ట్రలోని పుణెకు చెందిన గోల్డెన్ బాయ్స్ సన్నీ నన వాగ్చోరే, సంజయ్ దత్తాత్రేయ గుజర్, ప్రీతి సోనీ శుక్రవారం తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనం చేసుకున్నారు. ఈ సమయంలో ఒంటి నిండా బంగారం ధరించుకున్నవారిని చూసిన భక్తులు ఫొటోలు దిగేందుకు ఎగబడ్డారు. వారి రక్షణకు 15 మంది సెక్యూరిటీ రావడం విశేషం. వాగ్చోరే, సంజయ్ గుజర్ ఇద్దరూ చెరో 10 కిలోల బంగారం ధరించగా.. ప్రీతి సోనీ 5 కేజీల బంగారం ధరించినట్టు సమాచారం.

– హైదరాబాద్ (నమస్తే తెలంగాణ)

కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలి

- నాన్ టీచింగ్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు షరీఫుద్దీన్

వ్యవసాయ యూనివర్సిటీ, ఆగస్టు 23: కాంగ్రెస్ సర్కార్ ప్రభుత్వఉద్యోగుల పట్ల మొండి వైఖరిని అవలంబిస్తున్నదని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయాలని పీవీ నరసింహారావు తెలంగాణ రాష్ట్ర పశువైద్య విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ షరీఫుద్దీన్, టీచింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ హరికృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం రాజేంద్రనగర్ వెటర్నరీ కళాశాల ఎదుట ఉద్యోగులు చేస్తున్న ధర్నాకు వారు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా షరీఫుద్దీన్ మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కంట్రిబ్యూషన్ విధానాన్ని రద్దుచేయాలని, మెడికల్ రీయంబర్స్‌మెంట్, కరువు భత్యం డీఏను విడుదల చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్స్ వర్కర్లను రెగ్యులర్ చేయాలని కోరారు. ధర్నాలో ప్రధాన కార్యదర్శి పీ సుదర్శన్, సీనియర్ నాయకులు అంజయ్య, అశోక్, నిరంజన్, రమా, మధుసూదన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ నేతలు జగదీశ్వర్, శ్రీనివాస్‌రావు

27 మందితో ఉద్యోగ జేఏసీ స్టీరింగ్ కమిటీ

- త్వరలో వంద మందితో ఎగ్జిక్యూటివ్ కమిటీ
- హక్కులు ఎలా సాధించుకోవాలో మాకు తెలుసు
- ప్రభుత్వం ఇచ్చిన ఆగస్టు 15 గడువు ముగిసింది
- ఉద్యోగుల జేఏసీ చైర్మన్ జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు

హైదరాబాద్, ఆగస్టు 23(నమస్తే తెలంగాణ): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి 27 మందితో స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్టు ఉద్యోగుల జేఏసీ నేతలు జగదీశ్వర్, శ్రీనివాసరావు వెల్లడించారు. రెండు రోజుల్లో వందమందితో ఎగ్జిక్యూటివ్ కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. శుక్రవారం జరిగిన ఉద్యోగ సంఘాల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇచ్చిన ఆగస్టు 15 గడువు ముగిసిందని పేర్కొన్నారు. 'ఉద్యమంలో ఫుల్‌టైం ట్రైనింగ్ అయినోళ్లం. మా డిమాండ్లు ఎలా సాధించుకోవాలో మాకు తెలుసు' అని వ్యాఖ్యానించారు. కొత్త ప్రభుత్వం వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా తమ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకపోవడం నిరాశ కలిగించిందని పేర్కొన్నారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) అమల్లోకి వచ్చిన సెప్టెంబర్ 1న బ్లాక్‌డేగా పరిగణించి రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు.

'బీపీఈడీ, యూజీడీపీఈడీ'లో 753 మందికి సీట్లు

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): టీజీ పీఈసెట్‌లో భాగంగా రెండేండ్ల బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(బీపీఈడీ), అండర్ గ్రాడ్యుయేట్ డిప్లామా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్(యూజీ డీపీఈడీ) కోర్సుల్లో అడ్మిషన్లు మొదలయ్యాయి. శుక్రవారం టీజీ పీఈసెట్ కన్వీనర్ విద్యార్థులకు తొలిదశ కౌన్సెలింగ్‌లో సీట్లను కేటాయించారు. కన్వీనర్ కోటాలో 1,737 సీట్లకు తొలిరోజు 753 సీట్లను కేటాయించారు. సీట్లు పొందిన విద్యార్థులు 28లోగా కాలేజీల్లో రిపోర్టు చేసి ట్యూషన్ ఫీజు చెల్లించాలని కన్వీనర్ సూచించారు.

30, 31న 'డిపార్టు మెంటల్' వైవా పరీక్షలు

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతుల పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదల చేశారు. 30, 31న వైవా-వోకో పరీక్షలు నిర్వహించనున్నట్టు టీజీపీఎస్సీ అధికారులు తెలిపారు. స్పెషల్ లాంగ్వేజీ తెలుగు టెస్ట్ ఆఫ్ ఆఫీసర్స్ కోసం ఈ వైవా పరీక్షలు నిర్వహించనున్నారు.

స్పోర్ట్స్ కోటాలో 'ఏఎంవీఐ'కి అభ్యర్థి ఎంపిక

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): ఏఎంవీఐ ఉద్యోగాల భర్తీకి స్పోర్ట్స్ కోటాలో పెండింగ్‌లో ఉన్న అభ్యర్థి ఎంపికైనట్టు శుక్రవారం టీజీపీఎస్సీ అధికారులు వెబ్‌నోట్ విడుదల చేశారు. ఎంపికైన అభ్యర్థికి 28న ఉస్మానియా దవాఖానలో వైద్య పరీక్షలు జరుగుతాయని, సదరు అభ్యర్థి తప్పకుండా హాజరు కావాలని తెలిపారు.

ప్రమోషన్ల అర్రాస్ వెనుక కాంగ్రెస్ నేత!

- సాంఘిక సంక్షేమ గురుకుల బదిలీల్లో ఇష్టారాజ్యం
- వచ్చే ఏడాది 'ఎమ్మెల్సీ' కోసం ఇప్పటినుంచే పావులు
- అక్రమాలకు సహకరించిన ఓ యూనియన్ నాయకుడు
- గురుకులాల్లో నమస్తే తెలంగాణ కథనం దుమారం
- అవకతవకలపై ఆరా తీస్తున్న సీఎం కార్యాలయం
- చక్రం తిప్పిన డాటా ఎంట్రీ ఆపరేటర్ అదృశ్యం

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీలో వెలుగు చూస్తున్న అక్రమాల వెనుక ఉన్నది ఎమ్మెల్సీ ఆశావహులేనని తెలిసింది. తమ రాజకీయ భవిష్యత్తు కోసం గురుకుల ఉపాధ్యాయులను ఆగం పట్టించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏ సొసైటీలోనూ లేనివిధంగా సోషల్ వెల్ఫేర్ సొసైటీలోనే బదిలీలు ఇంత గందరగోళంగా ఉండడానికి కాంగ్రెస్ పార్టీలోని కీలక నేతతోపాటు మరో యూనియన్ నేత కారణమన్న చర్చ జరుగుతున్నది. డీఎల్ బదిలీలు, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పోస్టుల ప్రమోషన్లలో జరిగిన అవకతవకలపై 'సీఎం శాఖలోనే పదోన్నతుల అర్రాస్' పేరిట 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన ప్రత్యేక కథనం దుమారం రేపుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయం గుట్టుగా విచారణను చేపట్టడం గమనార్హం.

ఎమ్మెల్సీ ఆశావహుల 'హస్తం'

వరంగల్-ఖమ్మం-నల్లగొండ, కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ టీచర్ ఎమ్మెల్సీ స్థానాలు వచ్చే ఏడాది మార్చిలో ఖాళీ కానున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సన్నిహితంగా, పార్టీలో కీలకంగా ఉన్న నాయకుడు వరంగల్-ఖమ్మం-నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన కన్ను గురుకులాలపై పడింది. గురుకుల సొసైటీకి చెందిన ఓ యూనియన్ నేతతో కలిసి బదిలీలను ఆసరాగా చేసుకుని ప్రణాళికలను రూపొందించి అమలు చేశారని టీచర్లు చర్చించుకుంటున్నారు. ఆ యూనియన్ నేత కూడా కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి బరిలో నిలవాలని కుతూహలం చూపుతున్నారు. దీంతో లోపాయికారీ ఒప్పందం చేసుకుని యూనియన్ నేతను ముందు పెట్టి వెనకాల ఈ తతంగమంతా నడిపించారని గురుకుల ఉపాధ్యాయ వర్గం కోడై కూస్తున్నది. కేసీఆర్ హయాంలో పెద్ద ఎత్తున ఏర్పాటైన గురుకులాల వల్ల టీచర్ల సంఖ్య బాగా పెరిగింది. దీంతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వీరు కీలకంగా మారారు. ఈ నేపథ్యంలో వారిని మంచి చేసుకోవడం ద్వారా ఎమ్మెల్సీ ఎన్నికల్లో లబ్ధి పొందాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగానే తాము పోటీలో నిలబడబోయే స్థానాల్లో ముందుగానే తమవారిని నియమించుకునేందుకు, అక్కడి గురుకుల సిబ్బందిని మచ్చిక చేసుకునేందుకు ఈ బదిలీలు, ప్రమోషన్లను పావుగా వాడుకున్నారు. తమకు అనుకూలమైన వారి కోసం, అనుకూలమైన స్థానాలను ఇప్పించడంలో చక్రం తిప్పారు. అందుకోసమే ఏ సొసైటీలోనూ లేనివిధంగా ఇక్కడమాత్రమే పట్టుబట్టి ఆఫ్‌లైన్‌లోనే బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియను చేపట్టేలా చేసి తమ ప్రణాళికలను గుట్టుగా అమలు చేశారని చెప్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో అర్హులు, మెరిట్ ఉన్నవారు తీవ్రంగా నష్టపోయారని పలువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయాల కోసం తమ జీవితాలతో చెలగాటమాడరని వాపోతున్నారు.



ఉలిక్కిపడిన ఉపాధ్యాయులు

'నమస్తే తెలంగాణ' పత్రికలో ప్రచురితమైన ప్రత్యేక కథనంతో సొసైటీ ప్రధాన కార్యాలయ ఉద్యోగులతోపాటు, బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియలో భాగస్వాములైన ఉపాధ్యాయులు ఉలిక్కిపడ్డారు. 'ఇప్పుడెలా?' అని చర్చించుకున్నట్టు తెలిసింది. ఇందులో కీలకంగా వ్యవహరించిన ఉన్నతాధికారులను సొసైటీ సెక్రటరీ హెడ్ ఆఫీస్‌కు పిలిపించుకుని ఆరా తీసినట్టు సమాచారం. టీచర్ల జాబితాల ఎంట్రీలో కీలకంగా వ్యవహరించిన డాటా ఎంట్రీ ఆపరేటర్ రెండ్రోజులుగా ఎవరికీ అందుబాటులో లేకుండా పోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. 'నమస్తే' కథనంతో గురుకుల సొసైటీల్లోని ఇతర టీచర్లందరిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

గుట్టుగా సీఎంవో ఎంక్వైరీ

గురుకుల సొసైటీ బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించి 'నమస్తే'లో ప్రచురితమైన కథనంతో ముఖ్యమంత్రి కార్యాలయ సిబ్బందిపై ప్రభుత్వం సీరియస్‌గానే స్పందించినట్టు విశ్వసనీయ సమాచారం. సాంఘిక సంక్షేమశాఖ ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి వద్దనే ఉన్నది. సీఎం అజమాయిషీలోని శాఖలోనే అక్రమాలు వెలుగుచూడడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ కాంగ్రెస్ నాయకుడు ఎవరు? యూనియన్ నేత ఎవరు? ఇందులో భాగస్వాములైన ఉద్యోగులు ఎవరు? ఇంకా ఎవరెవరున్నారు? సెక్రటరీ కనుసన్నల్లోనే ఇది జరిగిందా? లేదంటే తప్పుదోవపట్టించారా? అనే కోణంలో గుట్టుగా విచారణ ప్రారంభించినట్టు సచివాలయ అధికారులు చెప్తున్నారు. సొసైటీలోని ఇతర సిబ్బంది ద్వారా సదరు ఉద్యోగుల వివరాలతో, బదిలీలు, ప్రమోషన్లు కొనసాగించిన ప్రక్రియపైనా గుట్టుగా ఆరా తీస్తున్నారు. త్వరలోనే ఇందుకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశమున్నది.